క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దోమల మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

మిడుతూరు: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో (ఐఆర్ఎస్) ఇన్‌డోర్ రెసిడ్యూల్ స్ప్రే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోట దోమలు ప్రబలి మలేరియా, టైఫాయిడ్, కలరా తదితర వ్యాధులు పబలే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో ఐఆర్ఎస్ స్ప్రే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణయ్య, సూపర్‌వైజర్ ఏసేపు, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

స్వామిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



స్వామిరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన యాలూరి స్వామిరెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు, స్వతంత్ర్య సమరయోధుడు యాలూరి స్వామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రఘురామమూర్తి, రమేష్‌బాబు, రజిత, గుంపుల వెంకటేశ్వర్లు, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



సబ్‌రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న రైటర్లు

ఆత్మకూరు: నంద్యాల జిల్లా ఉత్తమ సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికైన ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ ఆదినారాయణను శనివారం డాక్యుమెంట్ రైటర్లు ధను, ప్రతాప్, రమేష్, రజాక్‌లు ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కూన రమేష్, వంశీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఎస్ఐగా రామ్మోహన్‌రెడ్డి



బొమ్మలసత్రం: మహానంది పోలీసు స్టేషన్ ఎస్ఐగా రామ్మోహన్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేసిన అనంతరం పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న శారదాబాయి

నంద్యాల (న్యూటౌన్): విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగిఉండాలని, ఈ మేరకు రెండు నెలల పాటు ఎయిడ్స్ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను అక్టోబర్ 11 వరకు ఎన్‌ఏసీఓ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు మేనేజర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టీబీజే ఎస్‌పీజీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ దేశంలో సంవత్సరానికి 2.5 లక్షల మంది ఎయిడ్స్‌బారిన పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 1600 మంది, జిల్లాలలో 400 మంది ఎయిడ్స్ బాధితులున్నారన్నారు. డాక్టర్ నసీం మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఎయిడ్స్ గురించి ప్రజల్లో అవగాహనపై సర్వేచేయగా..వంద మందిలో 28 శాతం మాత్రమే ఎయిడ్స్ గురించి తెలుసుకున్నారన్నారు. అభిషేక్, స్వప్నకుమారి, బాగ్యమ్మ, నాగేంద్ర, ప్రిన్సిపాల్ దివాకర్, శేఖర్ పాల్గొన్నారు.

ఈ ఆత్మకూరుకు ఏమైంది?

- పేట్రేగుతున్న రౌడీ సంస్కృతి
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న పట్టణ వాసులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణం ప్రశాంతతకు, ఆధ్యాత్మిక వాతావరణానికి పెట్టింది పేరు. నిరంతరం శ్రీశైలం, మహానందికి వెళ్లే భక్తులతో ఓ రకమైన జీవకళతో ఉంటుంది. అలాంటి ఆత్మకూరు ప్రతిష్టను ఇటీవల జరుగుతున్న పలు సంఘటనలు మసకబారుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆర్‌డీటీ కాలనీలో జర్నలిస్టు మహేష్ అనుమానాస్పద ఘటన, తాజాగా బాలుడు వాహిద్ కిడ్నాప్, బావిలో శవంగా మారడంతో రౌడీ సంస్కృతి పేట్రేగి పోతోందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇంత జరుగుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిద్రావస్థలో నిఘా

కొందరు తమ వ్యాపారాభివృద్ధిని రౌడీల నీడలో పెంచుకోవాలని చూస్తుండగా.. ఇంకొందరు తమ కక్షలను తీర్చుకునేందుకు విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. రౌడీ బ్యాచ్‌లు ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగడం, ద్విచక్రవాహనాలపై అతివేగంగా వెళ్లడం, సామాన్యులతో అనవసర వివాదాలకు దిగటం అడ్డుకున్న వారిపై దాడులకు తెగబడుతుండటం చూస్తే పోలీసుల నిఘా కొరవడిందా లేక అధికార పక్షం శాంతిభద్రతలను గాలి కొదిలేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పౌరులు మాత్రం ఇలాంటి ఘటనలను జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పోలీసులను, అధికారపక్షాన్ని కోరుతున్నారు.

శాంతిభద్రతలు అదుపుతప్పాయి



ఈ మధ్య కాలంలో ఆత్మకూరులో శాంతి భద్రతలు అదుపుతప్పాయి. యువత బహిరంగంగా మందు తాగడం, మోటార్ సైకిళ్లపై విచ్చలవిడిగా తిరగడం చూస్తే భయమేస్తోంది. మద్యం తాగి గుంపులుగా తిరగడంతో ఘర్షణలు తలెత్తి అవి హత్యలకు దారి తీస్తున్నాయి. పోలీసులు నిఘాను పెంచి ఇలాంటి ఘటనలు అరికట్టాలి.
– సుల్తాన్, కౌన్సిలర్, ఆత్మకూరు

పొలాల్లో తాగి అల్లరి చేస్తున్నారు



ఆత్మకూరు పట్టణానికి చెందిన కొందరు గుంపులుగా కేజీ రోడ్డుకు అటుఇటు ఉన్న పొలాల్లో కూర్చుని మందు తాగుతున్నారు. ఆ మత్తులో బైక్‌లపై మితిమీరిన వేగంతో రోడ్లపై వెళ్తూ ప్రమాదకరంగా తయారవుతున్నారు. రూల్స్ పాటించకుండా ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇలాంటి గుంపుల్లో రౌడీ షీటర్లు కూడా ఉంటుండంతో ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. – లక్ష్మన్న, కరివేన

రౌడీయిజాన్ని అణచివేస్తాం



ఆత్మకూరు పట్టణంలో రౌడీల వల్ల జరుగుతున్న అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెడతాం. రౌడీల నడ్డి విరగ్గొట్టి శాంతిని స్థాపిస్తాం. అధికారుల బదిలీలు, కొన్ని రాష్ట్రస్థాయి సంచలన కేసుల దర్యాప్తు ఉన్నందున విజిబుల్ పోలీసింగ్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. బహిరంగ మద్యపానం చట్ట రీత్యా శిక్షించ దగ్గనేరం. దాన్ని అరికడతాం.
– రామాంజి నాయక్, ఎస్‌డీపీఓ ఆత్మకూరు

ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టండి



బీఎల్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా: ఇంటింటికీ వెళ్లి పకడ్బందీగా ఓటర్ల సర్వే చేపట్టాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి బీఎల్‌ఓలు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించుకొని తప్పొప్పులను సవరిస్తారన్నారు. 01 జనవరి 2025 నాటికి 18ఏళ్లు నిండే యువతీ, యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 తేదీ వరకు ఇంటింటి సర్వే కొనసాగుతుందన్నారు. డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం త్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వస్త్ర సమర్పణ విశేషార్చనలు, నానబెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.



పూజలందుకుంటున్న శనగల బసవన్న

సహాయ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డికి ప్రస్తుతం ఉన్న విధులతో పాటు అదనంగా రెవెన్యూ విభాగాన్ని కేటాయిస్తూ శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాల ఏఈఓగా ఎం.ఫణి ధరప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే ఫణి ధరప్రసాద్ రెవెన్యూ ఏఈఓగా బాధ్యతలు చేపట్టారు. అయితే బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే ఆయన్ను మరోసారి అంతర్గత బదిలీ చేశారు. ప్రస్తుతం పారిశుద్ధ్యం విభాగం ఏఈఓగా మాత్రమే విధులు కేటాయించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

జూపాడుబంగ్లా: నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని నంద్యాల ఎంపీ శబరి తెలిపారు. శనివారం ఆమె తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యా, వైద్యం, పారిశుద్ధ్యానికి పెద్దపీటవేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను వినియోగించి నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడతానన్నారు. అలాగే తర్తూరు దేవాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. తర్తూరు గ్రామానికి కేజీ రోడ్డు నుంచి రోడ్డు విస్తరణకు కృషి చేస్తానన్నారు.

పాఠశాలల చైర్మన్ల ఎన్నిక

కొత్తపల్లి: మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. అయితే చిన్నగుమ్మడాపురం, ముసలిమడుగు ఉర్దూ పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ రెండు పాఠశాలలకు శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామృష్ణయ్య, షేక్ రుక్సానాల ఆధ్వర్యంలో, ఎంఈఓ బ్రహ్మం నాయక్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఇందులో చిన్నగుమ్మడాపురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా ఎన్.రాణి, వైస్ చైర్మన్‌గా ఎస్.ప్రభాకర్, ముసలిమడుగు ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా షేక్ మాసుం, వైస్ చైర్మన్‌గా ఎస్.ముబీనాలు ఎన్నికైనట్లు హెచ్ఎంలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి

బండిఆత్మకూరు: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అధికారులు ఆయా శాఖల అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి పలు శాఖ అధికారులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ వాసుదేవగుప్తకు సూచించారు. మండలంలో అభివృద్ధి నివేదికలకు విద్యాశాఖ అధికారి యశోద, వైద్య ఆరోగ్యశాఖ అధికారి భావన, పశువైద్యశాఖ అధికారిణి సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనరసింహ, పీఆర్ ఏఈ వెంకటయ్య, వెలుగు సీసీ వెంకటసుబ్బయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో తహసీల్దార్ అల్‌ఫ్రెడ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు జ్ఞానాభరణం, పెద్దినేని పెద్దన్న, కాలూరి శ్వేతకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంజిన్ బోట్లు నడిపితే కఠిన చర్యలు

పగిడ్యాల: కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో అనుమతి లేకుండా ఇంజిన్ బోట్లు నడిపితే చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని నెహ్రూనగర్ సమీపాన ఉండే అర్లపాడు ఘాట్, మూర్వకొండ ఘాట్‌లను ఆయన సందర్శించారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు భారీగా వరద జలాలు వచ్చి చేరడం వలన 885 అడుగుల సామర్థ్యం వరకు బ్యాక్‌వాటర్ విస్తరించిందన్నారు. కృష్ణానది తీర గ్రామాలైన పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, ఎస్. ఘణపురం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్‌ల నుంచి ఇంజిన్ బోట్లలో ప్రయాణికులను ఆవలి ఒడ్డు తెలంగాణ రాష్ట్రం మంచాలకట్ట, చెల్లపాడు గ్రామాలకు నిర్వాహకులు బోట్లు నడపరాదని సూచించారు. ఇంజిన్ బోట్లు నడిపేందుకు పోర్ట్ అధికారుల నుంచి లైసెన్స్ తీసుకోవాలన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

కొత్తపలి: మండలంలోని పాలెం చెరువు చెంచుగూడెం ఎండీయూ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని గువ్వలకుంట్ల గ్రామ సర్పంచ్ మశమ్మ కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గూడెంలో ఉన్న చెంచు గిరిజనులకు ప్రభుత్వం నుంచి వస్తున్న నిత్యావసర సరుకులను సరిగా పంపిణీ చేయలేదని చెంచు గిరిజనులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అలాగే గత నెలలో 15 మంది గిరిజనులకు వేలిముద్ర వేయించుకున్న తర్వాత బియ్యం ఇవ్వలేదని చెప్పారు. ఈ విషయంపై ఎండీయూ ఆపరేటర్‌ను అడుగగా ఆగస్టు నెలలో ఇస్తామని చెప్పారన్నారు. ఈ నెలలో కూడా బియ్యం ఇవ్వకపోవడంతో అతడిని ప్రశ్నిస్తే తనపైపై, తన భర్తపై ఎండీయూ ఆపరేటర్ కుమార్, భార్య ఇద్దరూ కలిసి దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనపై దాడి చేసిన కుమార్‌ను విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని స్థానిక తహసీల్దార్‌కు కూడా వినతిపత్రం ఇచ్చామన్నారు.

రేపు శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఈనెల 19న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు శ్రీవీరభద్రస్వామి సేవా సమితి సభ్యులు ఆదివారం తెలిపారు. శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల కళ్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మళ్లీ చిరుత సంచారం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని తెలుగు విశ్వవిద్యాలయం కాంపౌండ్ వాల్‌పై శుక్రవారం సాయంత్రం చిరుత తాపీగా నడుచుకుంటూ వెళ్తుండగా వాహనదారులు గమనించి వీడియో తీశారు. గడిచిన 15 రోజుల్లో చిరుత కనిపించడం రెండవసారి. నాలుగు రోజుల క్రితం దేవస్థానం ఏఈఓ ఇంటి కాంపౌండ్ వాల్‌పై కుక్కను తీసుకెళ్లటానికి ప్రయత్నం చేసినప్పుడు వారు అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. చిరుతలు స్థానికంగా ఉండే కుక్కలను వేటాడేందుకు జనావాసాల్లోకి వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



తెలుగు వర్సిటీ కాంపౌండ్ గోడపై చిరుత

శనగలో అధిక దిగుబడులు సాధించవచ్చు



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

నంద్యాల(అర్బన్): ఖరీఫ్‌లో కొర్ర, మినుము, సోయాబీన్ వంటి పంటల సాగు తర్వాత శనగ సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. శనగ పంటకు ముందు ఎటువంటి పంటను విత్తక పోతే భూమిలో ఉష్ణోగ్రత పెరగడం, మే నెలలో తేమ శాతం తగ్గుతుందని, తద్వారా పంట దిగుబడులు ఆశించినంతగా రావన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ పంటలు పండించక ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, అశోక్‌కుమార్, శివరామకృష్ణ, నీలిమ తదితరులు పలు పంటల సాగు గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారిణి మృతి



లిఖిత రెడ్డి (ఫైల్)

కర్నూలు (టౌన్): రోడ్డు ప్రమాదంలో జాతీయ స్థాయి క్యారమ్స్ క్రీడాకారిణి లిఖిత రెడ్డి మృతి చెందారు. నంద్యాల జిల్లా మహానంది మండలానికి చెందిన ఈమె క్యారమ్స్ క్రీడాంశంలో ఎనిమిది సార్లు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని పతకాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం బస్సు స్టేజీ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె మృతి చెందారు. ఆమె మృతికి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, శ్రీనివాసులు, క్యారెమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విరాజ్‌కుమార్, సంపతి, అబ్దుల్ జలీల్ సంతాపం తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఆత్మకూరు: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ హెచ్చరించారు. శనివారం బండిఆత్మకూరు మండలం నారాయణపురం ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనికీ చేసి, వాక్సినేషన్ పెర్ఫార్మన్స్, బీసీజీ, ఏఎన్‌సీ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



వీపనగండ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ పీరునాయక్

మిడుతూరు: ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ పీరునాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమం (భూసార పరీక్షలు, విత్తన శుద్ధి) నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా పంటల్లో ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. భూమిలో సారం పెంచేందుకు పాతపద్ధతులు మాని రసాయనిక ఎరువులు వాడుతున్నారని అన్నారు. దీంతో భూమిలో పోషక విలువలు దెబ్బతిని భూమి నిర్జీవమై దిగుబడులు తగ్గుతున్నాయని చెప్పారు. అలాగే మండలంలోని వీపనగండ్ల గ్రామంలో పంట నమోదుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ పొలాల్లో వేసుకున్న పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు రాము, అనురాధ పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



ఆత్మకూరులో నిరసన తెలియజేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



సున్నిపెంటలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

ఆత్మకూరు: పశ్చిమ బెంగాల్ ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాయుడు, వైద్య సిబ్బంది ఓపీ సేవలను నిలిపివేసి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 'వైద్యులకు రక్షణ ప్రభుత్వ బాధ్యత, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి, ప్రాణం పోసేవారి ప్రాణం తీయకండి, వైద్యులపై దాడులను అరికట్టాలని' నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యులకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల విధులకు ఆటంకం కలిగించకుండా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టాలు చేయాలన్నారు. వైద్యాధికారి కవిత, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ వసంతమ్మ, సరోజినీదేవి, స్వాతి, టెక్నీషియన్స్ ప్రసాద్, శివ, సుజాత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

శ్రీశైలంప్రాజెక్ట్: స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని డాక్టర్ పి.జాన్సీరాణి అన్నారు. కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'అర్ధరాత్రి ఒంటరిగా ఆడది నడిచినప్పుడే అసలైన స్వాతంత్ర్యమని అన్న గాంధీజీ మాటలు, సంపూర్ణ స్వేచ్ఛను స్త్రీ జాతి పొందగలిగినప్పుడే సమసమాజ నిర్మాణమని లెనిన్ కన్న కలలు భారతదేశంలో కల్లలుగానే ఉన్నాయన్నారు. డాక్టర్లు లీలా వినయ్‌రెడ్డి, సోహైల్, యజ్ఞప్రసాద్, విజయ్‌భర్గవ్, విజయలక్ష్మి, రత్నజ్యోతి, వేణుగోపాల్‌నాయుడు, మణికంఠ, లక్ష్మీ, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

జూపాడుబంగ్లా: కలకత్తా నగరంలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని పారుమంచాల ప్రాథమిక వైద్యశాల డాక్టర్ యశ్విని డిమాండ్ చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం వైద్యసిబ్బందితో కలసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. హాస్పటల్ నుంచి గ్రామంలోని గాంధీ విగ్రహం వరకు ప్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రకాశ్, గ్రామస్తులు కలిముల్లా, రసూల్, దుబాయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో మృతిపై ఆర్డీఓ విచారణ



మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని మిడ్తూరు పోలీసుల అదుపులో ఉన్న హుస్సేన్ అలియాస్ యోహాన్ మృతి చెందిన ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ ఈనెల 24న బహిరంగ విచారణ చేయనున్నారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ దాసు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు ఆత్మకూరు డివిజనల్ మెజిస్ట్రేట్, రెవెన్యూ అధికారి కార్యాలయంలో బహిరంగ విచారణ జరగనుంది. సంఘటనకు సంబంధించిన అధికారులు, సాక్షులు, ఇతరులు ఆ రోజు హాజరై తమ వాదనలు, సాక్ష్యాలను ఆర్డీఓకు సమర్పించవచ్చు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళా వేదికపై కర్నూలుకు చెందిన నాగమల్లేశ్వరి బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శనతో అలరించింది. ఆనంద నాట్యగణపతిం, శివ శివ శంకర, శివతాండవం, కాలభైరవాష్టకం, ఓం నమఃశివాయా, తాండవ నృత్యకరి తదితర గీతాలకు హిమబిందు, లాస్య, వేదశ్రీ, ప్రణవి, వైష్ణవి, వర్షిణి, సాహిత్య, మనస్వి, నవ్యశ్రీ, శ్లోక, వెన్నల, దీప్తి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. అలాగే రెండో కార్యక్రమంలో భాగంగా కర్నూలుకు చెందిన వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం వారిచే భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జయగణేశ, శివుని శిరస్సుపైనా, అదిగదిగో శ్రీశైలం, బ్రహ్మమురారి, ఓంకారరూపిణి, గిరిజాశంకరా, శుక్రవారం శుభవేళ తదితర గీతాలను సాక్షి, మీనాక్షి, సునంద, విహారిక, హర్షిత, అధ్యశ్రీ, శ్రీకృతి, వైష్ణవి, గాయత్రి, పూర్ణిమ, భార్గవ్, గణేశ్, బ్రహ్మణి తదితరులు ఆలపించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

నందికొట్కూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించకపోతే చర్యలు తప్పవని బైరెడ్డి శబరి హెచ్ఎంలను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడు తూ విద్యార్థులకు బలమైన ఆహారం అందించాల న్నారు. రుచికరంగా లేని ఆహారం విద్యార్థులకు వడ్డిస్తే వంట నిర్వాహకులను మార్పు చేయక తప్పదని స్పష్టం చేశారు. పాఠశాలల హెచ్ఎంలు మధ్యాహ్న భోజనం ఎలా ఉందో ప్రతి రోజు తెలుసుకోవాలని ఆదేశించా రు. అనంతరం బైరెడ్డి నగర్‌లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఎంపీకి వినతి పత్రం అందజేశారు.మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జయసూర్య హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆత్మ భవనంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. రైతులకు నకిలీవి అంటగడితే లైసెన్స్‌లు రద్దు చేయిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఓ షేక్షావలి, కౌన్సిలర్లు చిన్నరాజు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.